సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

ఆదివారం । 10 । సెప్టెంబర్ । 2023



రూ.లక్ష విరాళం

ద్వారకా తిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు కలిదిండి గ్రామానికి చెందిన కృష్ణచైతన్య, మాధురి, దీపక్ శనివారం రూ.1,00,116 విరాళం సమర్పించారు.



ఆక్వా సాగుకు పెద్ద ఎత్తున ప్రోత్సాహం

మత్స్య సంపద సృష్టిలో అగ్రగామిగా ఉన్న రాష్ట్రంలో వీటి వినియోగాన్ని పెంచడమే లక్ష్యంగా సీఫుడ్ ఫెస్టివల్స్ నిర్వహిస్తున్నామని రాష్ట్ర మత్స్య శాఖ కమిషనర్ కె.కన్నబాబు తెలిపారు. - IIలో▸

కడలిలోకి 4.24 లక్షల క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం 4,24,387 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. డెల్టా కాలువలకు 10,700 క్యూసెక్కులు వదిలారు. ఇందులో తూర్పు డెల్టాకు 4,800, మధ్య డెల్టాకు 2,400, పశ్చిమ డెల్టాకు 3,500 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 9.90, భద్రాచలం వద్ద 28.80 అడుగులకు నీటిమట్టం చేరింది.

న్యూస్‌రీల్

బాలాజీ సన్నిధిలో భక్తుల కోలాహలం



అప్పనపల్లి బాలబాలాజీ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి ఆలయానికి శనివారం భారీగా భక్తులు తరలి వచ్చారు. శ్రావణ శనివారం కావడంతో తెల్లవారుజాము నుంచే ఆలయం భక్తులతో కోలాహలంగా మారింది. భక్తులు తొలుత పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. అనంతరం స్వామివారికి ముడుపులు, మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి వారికి వివిధ సేవల ద్వారా రూ.3.64 లక్షల ఆదాయం వచ్చింది. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.2.85 లక్షల ఆదాయం సమకూరింది. నిత్యాన్నదానం ట్రస్టుకు రూ.79,561 ఆదాయం వచ్చింది. 5,381 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 4,572 మంది అన్న ప్రసాదం స్వీకరించారు. ఆలయ ఈఓ జి.మాధవి, ధర్మకర్తలమండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ట్రస్టు బోర్డు సభ్యులు చిట్టాల సత్తిబాబు, కొమ్ముల సూరిబాబు, గూటం శ్రీను ఏర్పాట్లను పర్యవేక్షించారు.

12న అమలాపురంలో జాబ్‌మేళా

అమలాపురం రూరల్: కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయంలో ఈ నెల 12న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా శనివారం తెలిపారు. ఐదు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరై ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని చెప్పారు. మరిన్ని వివరాలకు వికాస జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్‌ను సంప్రదించాలని సూచించారు.

ప్రత్తిపాడు తహసీల్దార్ సస్పెన్షన్

ప్రత్తిపాడు: స్థానిక తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణను చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్‌ఏ) సస్పెండ్ చేశారు. ప్రత్తిపాడు మండలం గోకవరంలో సుమారు 25 ఎకరాల భూమి శరభవరం గ్రామానికి చెందిన కూసుమంచి సీతయమ్మకు చెందినట్టుగా రికార్డుల్లో ఉంది. అయితే, పెద్దిపాలెం గ్రామానికి చెందిన చింతాకుల భాస్కరరావు కుటుంబీకులు సుమారు 40 ఏళ్లుగా సాగు చేస్తున్నారు. భూమికి తామే హక్కుదారులమంటూ ఇరు వర్గీయులు కోర్టును ఆశ్రయించారు. అయితే ఈ భూమిలో 10 ఎకరాలను సత్తి వినోద్ కుమార్ రెడ్డి అనే వ్యక్తికి సీతయమ్మ విక్రయించింది. వ్యవహారం కోర్టులో ఉన్నా వినోద్ కుమార్ రెడ్డికి పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయడంతో చింతాకుల భాస్కరరావు కుటుంబీకులు సీసీఎల్‌ఏ కమిషనర్‌ను ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన సీసీఎల్‌ఏ.. తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణను సస్పెండ్ చేశారు. ఈ విషయాన్ని పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు ధ్రువీకరించారు. ఏలేశ్వరం తహసీల్దార్ చిన్నారావును ప్రత్తిపాడు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియమించారని ఆర్డీఓ తెలిపారు.

రాజమహేంద్రవరం డివిజన్‌లో 144 సెక్షన్

ఆర్డీవో, సబ్ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ చైత్రవర్షిణి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్ట్ నేపథ్యంలో ప్రజల సాధారణ జీవనానికి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో 9 తొమ్మిది మండలాలకు చెందిన అన్ని గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో 144వ సీఆర్ పీసీ సెక్షన్ అమలు చేస్తున్నామని సబ్ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్, రాజమహేంద్రవరం ఆర్డీవో ఎ.చైత్రవర్షిణి శనివారం సాయంత్రం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా శనివారం ఉదయం 6 గంటల నుంచి ఈ నెల 16వ తేదీ రాత్రి 12 గంటల వరకూ 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. నలుగురికి మించి ఒకచోట గుంపుగా చేరడం, ఆయుధాలు కలిగి ఉండడం, ప్రజల సాధారణ జీవనానికి ఇబ్బందులు కల్పించే ఉద్దేశంతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడడం, సంఘ విద్రోహ చర్యలకు పాల్పడడం చేయరాదన్నారు.

జన స్పందన నిల్

- చంద్రబాబు అరెస్టును పట్టించుకోని ప్రజలు
- అధినేత అడ్డంగా దొరకడంతో స్పందించని టీడీపీ శ్రేణులు
- పై నుంచి ఆదేశించినా పట్టించుకోని ద్వితీయ శ్రేణి నేతలు, కార్యకర్తలు
- కాసేపు నాయకుల హడావుడితో సరి
- ముందు జాగ్రత్తగా పోలీసుల పటిష్ట బందోబస్తు



అమలాపురంలో పోలీసుల బందోబస్తు

సాక్షి, అమలాపురం: స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో పార్టీ అధినేత చంద్రబాబు అడ్డంగా దొరికిపోవడం టీడీపీ నేతలకు, కార్యకర్తలకు మింగుడు పడని అంశంగా మారింది. బాబు అరెస్టుతో బ్రహ్మాండం బద్దలైపోతుందని ఆ పార్టీ అధిష్టానం ఆశించినా.. ప్రజలు ఏమాత్రం పట్టించుకోలేదు. చివరకు సొంత పార్టీ క్యాడర్‌లో కూడా పెద్దగా స్పందన కనిపించలేదు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ ఆందోళనలు చేపట్టాలని పార్టీ పెద్దల నుంచి ఆదేశాలు రావడంతో జిల్లాలో టీడీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ప్రజాప్రతినిధులు కాస్త హడావుడి చేసినట్టు కనిపించింది. కానీ అధినేత అరెస్టుపై మండల స్థాయి ప్రజాప్రతినిధులు, ద్వితీయ శ్రేణి నాయకులు, క్రియాశీలక కార్యకర్తలు కనీసం నిరసన కూడా తెలపడానికి సిద్ధపడలేదు.

అక్కడక్కడ.. మొక్కుబడిగా..

చిన్న సాకు దొరికితే చాలు.. మండల, జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, రాస్తారోకోలు చేసే టీడీపీ నేతలు.. తమ అధినేతను అరెస్టు చేస్తే దాదాపు మిన్నకుండిపోయారు. సీఐడీ అధికారులు పక్కా ఆధారాలతో చంద్రబాబును అరెస్టు చేయడమే ఇందుకు కారణం. దీంతో మండల కేంద్రాల్లో వద్ద ఎటువంటి నిరసనలూ జరగలేదు. అక్కడక్కడ మొక్కుబడిగా ఆందోళనలు చేశారు. మండపేటలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, కొత్తపేటలో మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకుని మధ్యాహ్నం విడిచిపెట్టారు. కొత్తపేటలో బంద్ చేయాల్సిందిగా వ్యాపారులపై టీడీపీ క్యాడర్ ఒత్తిడి చేయడంతో మెయిన్ రోడ్డులో కొద్దిసేపు షాపులు మూసివేశారు. మిగిలిన చోట్ల షాపులు యథావిధిగా తెరచుకున్నాయి. రాజోలులో పార్టీ నేత లోకేష్ హైడ్రామా మినహా మిగిలిన నియోజకవర్గంలో ఎక్కడా చంద్రబాబు అరెస్టుపై ఏ ఒక్కరూ స్పందించలేదు. సొంత పార్టీ క్యాడర్ నుంచే స్పందన లేకపోవడంతో అధిష్టానం ఆందోళన చెందింది. సాయంత్రం సమయంలో మరోసారి పెద్దల నుంచి పిలుపు రావడంతో తప్పదన్నట్టు కొన్ని ప్రాంతాల్లో కొవ్వొత్తులతో నిరసన తెలిపారు.

పోలీసులు అప్రమత్తం

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఇటీవల చంద్రబాబు, లోకేష్ పర్యటనల్లో అలజడులు, ఘర్షణలు చోటు చేసుకుంటున్న విషయం తెలిసిందే. చిత్తూరు జిల్లా పుంగనూరులో టీడీపీ క్యాడర్ రెచ్చిపోయి విధ్వంసానికి పాల్పడిన ఘటనతో పాటు.. యువగళంలో పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం వద్ద లోకేష్ స్వయంగా క్యాడర్‌ను ఘర్షణలకు ఉసిగొల్పడం వంటి ఘటనలను దృష్టిలో ఉంచుకుని పోలీసులు అప్రమత్తమయ్యారు. చంద్రబాబు అరెస్టు సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలూ జరగకుండా పటిష్ట చర్యలు తీసుకున్నారు. ప్రధాన నేతలను ఉదయమే ముందస్తుగా గృహ నిర్బంధం చేశారు. ప్రధాన కూడళ్లలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లాలోని అమలాపురం, రావులపాలెం, రామచంద్రపురం ఆర్టీసీ డిపోల వద్ద బస్సులను ముందుజాగ్రత్తగా ఉదయం నిలిపివేశారు. పదకొండు గంటల నుంచి బస్సులు తిరగడం ఆరంభమైంది. జిల్లాలోని పట్టణాలు, పల్లెల్లో సాధారణ జనజీవనం యథాతథంగా కొనసాగింది. దుకాణాలు మామూలుగానే తెరచుకున్నాయి.



◆ అధికారం చేతిలో ఉన్నప్పుడు చంద్రబాబు ప్రభుత్వ సొమ్ము రూ.371 కోట్లు అవినీతి చేశారు. ఇప్పుడు తానేం చేయలేదు, చాలా అమాయకుడినంటూ నవరస నటనా ప్రావీణ్యం ప్రదర్శిస్తున్నారు.

– **చిర్ల జగ్గిరెడ్డి**, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే, కొత్తపేట



◆ పాపం పండి అవినీతి సమ్రాట్ చంద్రబాబు అరెస్టు అయ్యారు. ఆయనతో సహా చట్టానికి ఎవరూ అతీతులు కారు. అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న చంద్రబాబు బండారం ఆధారాలతో సహా బయట పడటం వల్లనే సీఐడీ పోలీసులు ఆయనను అరెస్టు చేశారు. ఇది చట్ట పరిధిలో జరిగింది. ఆయన ఏ తప్పూ చేయకపోతే చట్టం ముందు తన నిర్దోషిత్వం నిరూపించుకోవాలి. కక్ష సాధింపు అంటూ రాజకీయ విమర్శలు చేయడం మంచిది కాదు. రానున్న రోజుల్లో ఆయన అవినీతి బాగోతాలు ఒక్కొక్కటిగా బయటకు వచ్చి, రాజకీయంగా సమాధి కావడం తథ్యం.

– **విప్పర్తి వేణుగోపాలరావు**, జెడ్పీ చైర్మన్, ఉమ్మడి తూర్పు గోదావరి



◆ చంద్రబాబు పాలనంతా స్కాములమయమే. ఓటుకు రూ.కోట్లు కేసులో అడ్డంగా దొరికిపోయి, స్టే తెచ్చుకుని వ్యవస్థలను మేనేజ్ చేశారు. అమరావతి రాజధాని నిర్మాణంలో వేలాది ఎకరాల భూ కుంభకోణానికి పాల్పడ్డారు. మాజీ మంత్రులు పత్తిపాటి పుల్లారావు, నారాయణలపై కేసు నమోదైంది. స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో రూ.371 కోట్ల ప్రజాధనం చేతులు మారాయి. దీనికి సంబంధించిన ఫైలును ఎందుకు మాయం చేశారో చంద్రబాబు సమాధానం చెప్పాలి.

– **బొమ్మి ఇజ్రాయిల్**, ఎమ్మెల్సీ



◆ నిప్పు అని చెప్పుకునే చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో అరెస్టు కావడంతో తాను తీసుకున్న గోతిలో తానే పడినట్టయ్యింది. పాపాలు పండి ఇప్పుడు దొరికిపోయాడు. ఇన్ని స్కాముల్లో ఉన్న చంద్రబాబు గురించి ఎప్పుడూ నోరు విప్పని పవన్ కల్యాణ్.. ఇప్పుడు ఆయన అరెస్టు అన్యాయమంటూ వంత పాడటం చూస్తుంటే వారి మధ్య ఉన్న ప్యాకేజీ మిత్రుత్వం మరోసారి బయట పడింది. చంద్రబాబు అవినీతి సొమ్ముల నుంచి పవన్ కల్యాణ్‌కు ప్యాకేజీ ముట్టి ఉంటే భవిష్యత్తులో ఆయన కూడా సీఐడీ విచారణ ఎదుర్కోక తప్పదేమో!

– **జిన్నూరి రామారావు** (బాబీ), ఏపీ అగ్రి మిషన్ సభ్యుడు

కాకినాడ క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీలు ప్రారంభం



పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులకు టీ షర్టులు అందిస్తున్న నిర్వాహకులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): వర్ధమాన క్రికెటర్లు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు కాకినాడ క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీలు ఎంతగానో ఉపయోగ పడతాయని జిల్లా క్రికెట్ సంఘం మాజీ అధ్యక్షుడు టి.హరీష్ అన్నారు. 'కొడితే కొట్టాలిరా' అనే నినాదంలో కాకినాడ క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీలు శనివారం స్థానిక జిల్లా క్రీడా మైదానంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. సానా సతీష్‌బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. ముందుగా దివంగత డాక్టర్ కె.స్వర్ణరాజుకు నివాళిగా క్రీడాకారులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. గౌరవ అతిథి, క్రికెట్ సంఘ మాజీ కార్యదర్శి కె.బాపిరాజు మాట్లాడుతూ దివంగత స్వర్ణరాజు క్రికెట్ ఆటగాళ్లకు ఎంతో ప్రోత్సాహాన్ని అందించేవారన్నారు. ఆయనను కోల్పోవడం చాలా బాధాకరం అన్నారు. క్రికెట్ మెరుగ్గా రాణించే వారికి ఇప్పుడు పుష్కలంగా అవకాశాలు ఉన్నాయన్నారు. సానా సతీష్ బాబు ఫౌండేషన్ ప్రతినిధి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ పోటీల్లో కాకినాడ జిల్లా పరిధిలోని 19 మండలాల నుంచి జట్లు పాల్గొంటున్నాయన్నారు. విజేత జట్టుకు రూ.15 వేలు, రన్నర్స్ జట్టుకు రూ.8 వేల చొప్పున నగదు పురస్కారాలు అందిస్తామన్నారు. అలాగే మండలస్థాయిలో ప్రతిభ కనబరిచిన వారితో రెండో లీగ్ నిర్వహించి విజేత జట్టుకు రూ.2 లక్షలు, రన్నర్స్ జట్టుకు రూ.1 లక్ష నగదు బహుమతులను సానా సతీష్‌బాబు చేతుల మీదుగా అందిస్తామని వివరించారు. అనంతరం ముఖ్య అతిథి హరీష్ టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో క్రికెట్ కోచ్ చార్లీ, ఫౌండేషన్ ప్రతినిధి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పంపా తీరం.. భక్త జన సంద్రం



సత్యదేవుని వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

అన్నవరం: వేలాదిగా తరలి వచ్చిన పెళ్లి బృందాలు, భక్తులతో రత్నగిరిపై కొలువైన సత్యదేవుని ఆలయం కిటకిటలాడింది. పంపా నదీ తీరం భక్తులతో నిండిపోయింది. శనివారం దశమి పర్వదినానికి తోడు రెండో శనివారం సెలవు దినం కావడంతో భారీగా భక్తులు తరలి వచ్చారు. దీనికి తోడు శుక్రవారం రాత్రి, శనివారం తెల్లవారుజామున సత్యదేవుని సన్నిధిలో సుమారు 50 వివాహాలు జరిగాయి. ఇక్కడ వివాహాలు చేసుకున్న దంపతులు, వారి బంధుమిత్రులతో బాటు ఇతర ప్రాంతాల్లో వివాహాలు చేసుకున్న నవ దంపతులు, వారి బంధువులు కూడా సత్యదేవుని దర్శనానికి, వ్రతాలు ఆచరించేందుకు తరలి వచ్చారు. దాంతో ఆలయ ప్రాంగణం, వ్రత, విశ్రాంతి మండపాలన్నీ భక్తులతో నిండిపోయాయి. స్వామి వారిని శనివారం సుమారు 40 వేల మంది భక్తులు దర్శించారని అధికారులు తెలిపారు. స్వామివారి వ్రతాలు 3,500 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది. స్వామివారి నిత్యాన్నదాన పథకంలో సుమారు ఐదు వేల మందికి భోజన సౌకర్యం కల్పించారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ దేవస్థానంలోని పలు విభాగాల్లో పర్యటించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాగా ఏకాదశి, సెలవు దినం అయినందున ఆదివారం కూడా రత్నగిరిపై భక్తుల తాకిడి అధికంగా ఉండే అవకాశం ఉంది. దీనికి తోడు వివాహాలు కూడా ఉండడంతో సత్రాల్లోని గదులను వివాహ బృందాలు రిజర్వ్ చేసుకోవడంతో సాధారణ భక్తులకు అద్దెకు గదులు దొరికే అవకాశం తక్కువ.

సాగుకు మొగల సెగ

- జిల్లాలో 45 వేల ఎకరాలకు పొంచి ఉన్న ముంపు
- ఏటా తవ్వుతున్నా.. కెరటాలతో మూత
- పూడికకు తోడవుతున్న ఆక్వా వ్యర్థాలు
- శాశ్వత పరిష్కారం కోరుతున్న రైతులు



ఇసుక మేటతో మూసుకుపోయిన ఎస్.రామేశ్వరం మొగ

అల్లవరం: రెండు నియోజకవర్గాలు.. ఐదు మండలాల పరిధిలోని వేలాది ఎకరాల్లో సాగుకు సముద్ర మొగలు ప్రధాన అవరోధాలుగా నిలుస్తున్నాయి. మూడు దశాబ్దాలుగా ఈ ప్రాంత వ్యవసాయ రంగానికి ఎస్.రామేశ్వరం, కూనవరం మొగలు గుదిబండగా మారాయి. ఏటా భారీ అలలకుడీ మొగలు ఇసుక మేటలతో పూడుకుపోతున్నాయి. దీనివల్ల ముంపు నీరు దిగక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

కారణాలెన్నో..

- ఈ మొగల వలన జిల్లాలోని అమలాపురం, అల్లవరం, అంబాజీపేట, అయినవిల్లి, ఉప్పలగుప్తం, కాట్రేనికోన, ముమ్మిడివరం మండలాల్లో సుమారు 45 వేల ఎకరాలు ఏటా ముంపు బారిన పడుతున్నాయి. వర్షాల సమయంలో చేల నుంచి వచ్చే ముంపు నీరు ఈ మొగల ద్వారానే దిగాల్సి ఉంటుంది.
- అమలాపురం, అల్లవరం, అయినవిల్లి మండలాల్లోని ముంపు నీరు.. లోయర్ కౌశిక, వాసాలతిప్ప, పంచనది మీడియం డ్రెయిన్లు, దేశికోడు మేజర్ డ్రెయిన్‌లోకి చేరి అల్లవరం మండలం ఎస్.రామేశ్వరం మొగ మీదుగా సముద్రానికి చేరాలి.
- అలాగే, ముమ్మిడివరం, కాట్రేనికోన, ఉప్పలగుప్తం మండలాల్లోని ప్రధాన డ్రెయిన్లు రంగరాజు కోడు, ఓల్డ్ అయినాపురం మీడియం డ్రెయిన్, కూనవరం మేజర్ డ్రెయిన్లలోకి చేరి అక్కడి నుంచి కూనవరం స్ట్రెయిట్ కట్ ద్వారా సముద్రంలోకి దిగాల్సి ఉంది.
- జనవరి నుంచి జూన్ నెల వరకూ ప్రధాన డ్రెయిన్లలో నీటి ప్రవాహం లేక మొగ ప్రాంతంలో భారీగా ఇసుక మేటలు వేస్తోంది. దీంతో అది పూడుకుపోయి ముంపునీరు దిగక, ఎగతన్ని పొలాలను ముంచేస్తోంది.
- ఈ ఏడాది వర్షాలు తక్కువగా ఉండడంతో మరింతగా మేటలు వేస్తున్నాయి. రామేశ్వరం మొగ మొత్తం మూసుకుపోగా, కూనవరం మొగ నుంచి సామర్థ్యం మేరకు ముంపు నీరు దిగడం లేదు.
- దీనికితోడు ఆక్వా చెరువుల నుంచి వ్యర్థాలను డ్రెయిన్లలోకి తోడుతున్నారు. ఇది కూడా మొగలు మూసుకుపోవడానికి కారణమవుతోంది. డ్రెయిన్ల నుంచి ప్రవాహం పడిపోవడంతో నీటి ఒరవడి లేక మొగలు పూడుకుపోతున్నాయి.
- డ్రెయిన్లలోని వలకట్ల వల్ల కూడా నీటి వేగం తగ్గి ఇసుక మేటలు వేస్తోంది.

గత ఏడాది తవ్వినా..

గత ఏడాది రామేశ్వరం మొగ, కూనవరం స్ట్రెయిట్‌కట్‌లు రెండుసార్లు మూసుకుపోవడంతో సాగు చేయలేని పరిస్థితి ఏర్పడింది. అమలాపురం ఎంపీ చింతా అనురాధ, ఏపీ అగ్రికల్చర్ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి, కలెక్టర్ హిమాన్షు శుక్లా కలగజేసుకుని ముంపు నివారణకు తాత్కాలికంగా తవ్వకాలు చేపట్టారు. దీనివలన కొంత వరకూ ముంపు నీరు దిగింది. తాజాగా రామేశ్వరం మొగ మూత పడటంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది.

శాశ్వత పరిష్కారమే శరణ్యం

- రామేశ్వరం మొగ, కూనవరం స్ట్రెయిట్‌కట్ నుంచి ముంపు నీరు సహజసిద్ధంగా సముద్రానికి చేరాలంటే ప్రధాన డ్రెయిన్లలో ఏర్పాటు చేసిన వలకట్లు తొలగించి, నీటి వేగాన్ని పెంచాలి.
- ప్రధాన డ్రెయిన్ల పొడవునా ఆక్రమణలు తొలగించాలి.
- రొయ్యల చెరువుల్లో ఆక్వా వ్యర్థాలను డ్రెయిన్లలోకి వదిలేయకుండా పటిష్ట చర్యలు చేపడితే ఈ రెండు మొగలూ పూర్వ వైభవం సంతరించుకుంటాయి.
- ముంపు నీరు దిగే రామేశ్వరం మొగ, కూనవరం స్ట్రెయిట్ కట్‌ల వద్ద సముద్రంలోకి సుమారు 150 మీటర్ల పొడవునా గ్రోయిన్లు నిర్మిస్తే పరిష్కారం ఉంటుందని డ్రెయిన్స్ అధికారులు అభిప్రాయపడుతున్నారు.



ముంపు నీరు దిగే కూనవరం స్ట్రెయిట్‌కట్



ప్రధాన డ్రెయిన్‌లో నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటున్న వలకట్లు

ఇరువైపులా రాతి కట్టడం కట్టాలి



నక్కా రామేశ్వరం, కూనవరం మొగల వద్ద ఇసుక మేటలు వేయకుండా రెండువైపులా రాతి కట్టడం నిర్మించాల్సి ఉంది. సముద్రంలో అలలు దాటే ప్రాంతం వరకూ దీనిని నిర్మించాలి. ఇది చాలా ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. ఎస్.రామేశ్వరం వంతెన నుంచి మొగకు మడ అడవుల మధ్య నుంచి లింక్ డ్రెయిన్ ఓపెన్ చేయడానికి రూ.87 లక్షలు మంజూరు చేశారు.

– **ఎంవీవీ కిషోర్**, డీఈ, డ్రెయిన్స్, అమలాపురం

క్లుప్తంగా

మహిళను తోసేసిన టీడీపీ నేత గొల్లపల్లి

సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్న వీడియో



మహిళ తలపై గొల్లపల్లి సూర్యారావు చేయి వేసి తోసివేస్తున్నట్టు వైరల్ అవుతున్న వీడియో చిత్రం

మలికిపురం: మాజీ మంత్రి, టీడీపీ రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జి గొల్లపల్లి సూర్యారావు మహిళను తోసివేస్తున్న వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. టీడీపీ నేత నారా లోకేష్ యువగళం పాదయాత్ర దిండి వంతెన వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోకి శుక్రవారం ప్రవేశించింది. ఆ సందర్భంగా ఆ పార్టీ నాయకులు పాదయాత్రకు స్వాగతం పలికారు. మలికిపురం, రాజోలు మండలాలకు చెందిన ఆ పార్టీ మహిళా నాయకులు కొంతమంది ఫొటోల కోసం ఎగబడ్డారు. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు రాజోలుకు చెందిన ఒక మహిళా నాయకురాలి తలపై చెయ్యి వేసి తోసేసినట్టు ఈ వీడియోలో ఉంది. గొల్లపల్లి తీరుపై పలువురు నాయకులు విమర్శలు చేస్తున్నారు.

స్పర్జన్‌రాజుకు అంతిమ వీడ్కోలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): స్థానిక రంగరాయ వైద్య కళాశాల పీడీ, జిల్లా ఒలింపిక్ సంఘ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.స్పర్జన్‌రాజుకు శనివారం రాజకీయ నాయకులు, వివిధ క్రీడా సంఘాల, క్రైస్తవ సంఘాల ప్రతినిధులు కన్నీటి వీడ్కోలు పలికారు. స్థానిక ఇన్‌కమ్ ట్యాక్స్ కాలనీలోని స్పర్జన్‌రాజు ఇంటి నుంచి ఉదయం ఆయన అంతిమ యాత్ర ప్రారంభమైంది. ఒలింపిక్ సంఘ మాజీ అధ్యక్షుడు వైడీ రామారావు, ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, కార్యదర్శి ఎన్.సతీష్‌రెడ్డిలు స్పర్జన్‌రాజు భౌతిక కాయానికి పూలమాలలు వేశారు. సంజయ్‌నగర్ క్రైస్తవ శ్మశాన వాటికలో స్పర్జన్‌రాజు అంత్యక్రియలను నిర్వహించారు.

ఆక్వా సాగుకు పెద్ద ఎత్తున ప్రోత్సాహం

- విదేశీ ఎగుమతుల్లో రాష్ట్ర వాటా 40 శాతం
- రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ కన్నబాబు
- సీఫుడ్ ఫెస్టివల్‌ను సందర్శించిన ఎంపీ భరత్, ఎమ్మెల్యే జక్కంపూడి



మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్, చిత్రంలో రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ కన్నబాబు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మత్స్య సంపద సృష్టిలో అగ్రగామిగా ఉన్న రాష్ట్రంలో వీటి వినియోగాన్ని పెంచడమే లక్ష్యంగా సీఫుడ్ ఫెస్టివల్స్ నిర్వహిస్తున్నామని రాష్ట్ర మత్స్య శాఖ కమిషనర్ కె.కన్నబాబు తెలిపారు. శనివారం స్థానిక మంజీర కన్వెన్షన్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ మత్స్యశాఖ ఆధ్వర్యంలో భూమి ఆర్గానిక్స్ సహకారంతో 4వ ఆక్వా- సీఫుడ్ ఫెస్టివల్ రెండో రోజు కార్యక్రమంలో కమిషనర్ కె.కన్నబాబు, ఎంపీ మార్గాని భరత్‌రామ్, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. కన్నబాబు మాట్లాడుతూ 'ఫిష్ ఆంధ్ర' బ్రాండ్‌ను ప్రమోట్ చేసేందుకే రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రధాన నగరాల్లో 'సీ ఫుడ్ ఫెస్టివల్స్ నిర్వహిస్తున్నామన్నారు. మూడు రోజుల ఫెస్టివల్‌లో భాగంగా చేపలు, రొయ్యలు, పీతలతో పాటు ఇతర సముద్ర ఉత్పత్తుల స్టాల్స్ ఏర్పాటు చేశామన్నారు. సముద్ర ఉత్పత్తులను ఏ విధంగా వినియోగించుకోవాలనే అంశాలకు సంబంధించి సీఫుడ్ ఫెస్టివల్‌కు హాజరైన రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ ఫెస్టివల్స్‌ను రానున్న రోజుల్లో అన్ని జిల్లా కేంద్రాలతో పాటు హైదరాబాద్, బెంగళూరు వంటి మహా నగరాల్లో నిర్వహిస్తామన్నారు.

ఆక్వా రంగానికి ప్రాధాన్యం: ఎంపీ భరత్‌రామ్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆక్వా రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని రాజమహేంద్రవరం ఎంపీ, వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్ మార్గాని భరత్‌రామ్ అన్నారు. మత్స్య ఉత్పత్తులు విదేశాలకు దేశమంతా జరిగే ఎగుమతుల్లో రాష్ట్రం 40 శాతంతో ముందంజలో ఉందన్నారు. ఆక్వా సాగు పెంచి ఆదాయ వనరుగా జీడీపీ వృద్ధి రేటులో ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో మత్స్య సంపద వినియోగాన్ని పెంచేందుకు రైతులకు అవసరమైన సబ్సిడీ, ప్రత్యామ్నాయ మార్కెటింగ్ సౌకర్యాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్నాయన్నారు.

ఆక్వా ఉత్పత్తుల వినియోగం పెంచాలి: జక్కంపూడి

ఏపీలో చేపల ఉత్పత్తి ఎక్కువగా ఉందని, అయితే వాటిపై అవగాహన లేక తక్కువగా వినియోగం జరుగుతున్నట్లు రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా తెలిపారు. ఇందుకు సంబంధించి దేశీయ మార్కెటింగ్ మరింత అభివృద్ధి జరగాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో ఆక్వారంగం అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో తోడ్పాటు అందిస్తున్నారన్నారు. ఫిష్ ఆంధ్రా ఔట్‌లెట్స్, మొబైల్ వాహనాలను ప్రోత్సహించి, రాయితీపై అందించడం ద్వారా ఆయా రంగాలపై ఆధారపడిన కుటుంబాలను ఆదుకుంటున్నామన్నారు. ఫిష్ ఆంధ్ర, ఫిట్ ఆంధ్రా పేరుతో ప్రజలకు ఇప్పటికే మత్స్య సంపదను అందుబాటులోకి తెచ్చామని, ఇందులో భాగంగా చేపలు, రొయ్యల వ్యాపారాభివృద్ధికి మొబైల్ వాహనాలు అందించామన్నారు. పలువురు వక్తలు మాట్లాడుతూ సముద్రపు ఉత్పత్తుల్లో కొవ్వు పదార్థాలు తక్కువగా ఉండి ప్రోటీన్లు అత్యధికంగా ఉంటాయని, ఈ ఆహారం నిత్యం తీసుకోవాలన్నారు. శాసనమండలి సభ్యులు వంకా రవీంద్రనాథ్, ఇళ్ల వెంకటేశ్వరరావు, మత్స్య శాఖ సీఈఓ రామకుమార్, మాజీ సీఈఓ సూర్యమిత్ర, భూమి ఆర్గానిక్స్ సంస్థ ప్రతినిధి రఘురామ్, మెరైన్ జేడీ వీవీ రావు, మత్స్య శాఖ అధికారులు వి.కృష్ణారావు, వీవీ రావు, లాల్ మహమ్మద్, పీవీ సత్యనారాయణ, ఆర్‌వీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

504 మద్యం బాటిళ్ల పట్టివేత

ఇద్దరి అరెస్టు, రూ.30 వేల స్వాధీనం



గోపాలపురంలో నిందితులు, మద్యాన్ని చూపుతున్న పోలీసు అధికారులు

గోపాలపురం: స్థానిక గుడ్డిగూడెం రోడ్డులో అక్రమంగా తరలిస్తున్న 504 మద్యం బాటిళ్లను శుక్రవారం గోపాలపురం పోలీసులు పట్టుకున్నారు. యానాం నుంచి చిన కారులో మద్యాన్ని తరలిస్తుండగా ఎస్ఐ సతీష్‌కుమార్, ఆయన సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. ఈ మద్యం విలువ రూ.1.45 లక్షలు ఉంటుందని ఎస్ఐ తెలిపారు. కాకినాడకు చెందిన నరుకుల వెంకటేష్, గోపాలపురానికి చెందిన మేకా రమేష్‌లను అరెస్టు చేసి, వారి నుంచి రూ.30 వేలు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వారిద్దరినీ కొవ్వూరు కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్టు ఎస్ఐ చెప్పారు. అక్రమ మద్యాన్ని పట్టుకున్న పోలీసులను దేవరపల్లి సీఐ అనసూరి శ్రీనివాసరావు అభినందించారు.

రహదారులకు మహర్దశ

రూ.92 కోట్లతో రోడ్ల అభివృద్ధి

ఆలమూరు: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో రాష్ట్ర రహదారులకు మహర్దశ పట్టనుంది. రాష్ట్ర ప్రభుత్వం రూ.92 కోట్లతో ఐదు రహదారులను పూర్తి లోతుతో పునరుద్ధరణ (ఎఫ్‌డీఆర్) సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించనుంది. దీనికిగాను విజయవాడలో ఆర్‌అండ్‌బీ శాఖ ఈ నెల 19న టెండర్లను పిలిచేందుకు సర్వం సిద్ధం చేసింది. ప్రస్తుతం ఉన్న ఐదున్నర మీటర్ల నుంచి ఏడు మీటర్ల వెడల్పుకు రహదారులను పెంచేందుకు అధికారులు కార్యాచరణ చేపట్టారు. రహదారికి ఇరువైపులా లోతుగా తవ్వి అందులో నాణ్యత ప్రమాణాలతో నల్లకంకర మిశ్రమాన్ని నింపి నిర్మాణాన్ని చేపడతారు. దీంతో పాటు ఇరువైపులా గ్రావెల్‌తో బెర్మ్‌లను పటిష్టం చేస్తారు. అంతే కాకుండా ఎఫ్‌డీఆర్ సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించిన ఆ రహదారులను ఐదేళ్ల పాటు పరిరక్షించాల్సిన బాధ్యత కూడా సంబంధిత కాంట్రాక్టర్లదే. దీనివల్ల రహదారుల నిర్మాణం నాణ్యతలో రాజీపడే అవకాశం ఉండదు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని మండపేట నుంచి జొన్నాడలో రోడ్డులో 13 కిలోమీటర్ల మేర రోడ్డుకు రూ.17.52 కోట్లు, మండపేట నుంచి దుళ్ల వరకూ రూ.7.83 కోట్లు, తూర్పుగోదావరి జిల్లా కడియం నుంచి వెదురుమూడి రోడ్డులో దుళ్ల వరకూ రూ.11.20 కోట్లు, కాకినాడ జిల్లా తుని నుంచి కత్తిపూడి వరకూ రూ.27.16 కోట్లు, గొల్లప్రోలు నుంచి రాజుపాలెం వరకూ రూ.8.63 కోట్లతో రహదారులను విస్తరించనున్నారు. దీనికి అదనంగా జీఎస్‌టీ, సీనరేజీ, ఇతర వ్యయాలతో కలిపి రూ.92 కోట్ల వ్యయం అవుతుంది. ఈ ఐదు రహదారుల్లో రెండు ప్రాజెక్టులు అంతర జిల్లాలను కలపనున్నాయి. రహదారులను నిర్ణీత కాలంలో పూర్తి చేసేందుకు గడువు విధించనున్నట్లు మండపేట ఆర్‌అండ్‌బీ జేఈ టి.సూర్యనారాయణ తెలిపారు.



మండపేట- జొన్నాడ రోడ్డు

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత



బాధితులకు చెక్కు అందజేస్తున్న న్యాయమూర్తి గంధం సునీత, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ప్రత్యూషకుమారి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): కక్షిదారులకు సత్వర న్యాయం అందించడమే జాతీయ లోక్ అదాలత్ లక్ష్యమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. తూర్పుగోదారి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ఏఎస్‌ఆర్ జిల్లాల పరిధిలో జాతీయ లోక్ అదాలత్ శనివారం జరిగింది. నాలుగు జిల్లాల పరిధిలో మొత్తం 44 బెంచ్‌లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులకు పరిహారం చెల్లిస్తున్నామన్నారు. కొన్ని బీమా కంపెనీలు మోడల్ చెక్కు పంపిణీ చేస్తామని ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఇన్సూరెన్స్, సివిల్ తగాదాలు, మోటారు వాహన ప్రమాదాలు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసుల పరిష్కారంలో చొరవ చూపేందుకు ముందుకు వచ్చిన ఇన్సూరెన్స్ కంపెనీలు, న్యాయవాదులు, ఇతర శాఖల అధికారులు, తదితరుల భాగస్వామ్యాల సహకారం అభినందనీయమన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రత్యూషకుమారి మాట్లాడుతూ ప్రతి ఏడాది నాలుగు సార్లు జాతీయ లోక్‌అదాలత్, మూడు సార్లు ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తూ కక్షిదారులకు సత్వర న్యాయం జరిగేలా న్యాయమూర్తులు, కోర్టులు పని చేస్తున్నాయన్నారు. రాత్రి 9 గంటల వరకూ 9,125 కేసులు పరిష్కరించారు. లోక్ అదాలత్‌లో ఐదో అదనపు జిల్లా న్యాయమూర్తి డి.విజయ గౌతమ్, స్పెషల్ ట్రిబ్యునల్ జడ్జి ఎస్‌పీఈ, ఏసీబీ కోర్ట్ న్యాయమూర్తి యయు ప్రసాద్, ఒకటో అదనపు సివిల్ జడ్జి ఎస్‌కే జానీబాషా, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మి, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎ.కృష్ణప్రసాద్, మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి సి.రమ్య, నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి.సాయిసుధ తదితరులు పాల్గొన్నారు.

పరిష్కారమైన కీలక కేసులు

సీహెచ్‌వీ రెడ్డి వర్సెస్ శ్రీరామ్ కంపెనీ మధ్య రూ.67 లక్షలకు రాజీ, సి.రామకృష్ణ వర్సెస్ యునైటెడ్ ఇన్సూరెన్స్ మధ్య రూ.13.75 లక్షలకు రాజీ, బి.మహేష్ వర్సెస్ యునైటెడ్ ఇన్సూరెన్స్ మధ్య రూ.12.75 లక్షలు, వై.రామకష్ణ వర్సెస్ బజాజ్ ఇన్సూరెన్స్ మధ్య రూ.11 లక్షలు, సి.రామకృష్ణ వర్సెస్ రిలయన్స్ ఇన్సూరెన్స్ కంపెనీ మధ్య రూ.13 లక్షలు, బి.మహేష్‌కుమార్ వర్సెస్ ఐసీఐసీఐ ఇన్సూరెన్స్ మధ్య 13.75 లక్షలు, జి.సంతీష్ కుమార్ వర్సెస్ ఏపీఎస్ ఆర్టీసీ మధ్య రూ.8 లక్షలకు రాజీ ద్వారా పరిష్కారం లభించింది.

గోవిందా... హరి గోవిందా



భక్తులతో పోటెత్తిన వెంకన్న ఆలయం

ఆత్రేయపురం: గోవిందా.. హరి గోవిందా.. గోకుల నందన గోవిందా.. నామ స్మరణతో వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి క్షేత్రం మార్మోగింది. శనివారం రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 40 వేల మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారిని నెమలి పింఛాలు, వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, పుణ్యాహవచనం తదితర పూజలు జరిగాయి. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు. ప్రత్యేక దర్శనం, అన్నప్రసాద విరాళాలు, లడ్డూ ప్రసాదం విక్రయాలు, వివిధ సేవల ద్వారా విరాళాలుగా రూ.38,32,739 ఆదాయం వచ్చిందని ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. వాడపల్లి వేంకటేశ్వర స్వామివారి మహత్యం ఎనలేనిదని భగవద్గీత ఉపన్యాసకుడు రాధా మనోహర్‌దాస్ అన్నారు. స్వామివారిని ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆయనకు ఆలయ కమిటీ చైర్మన్ రమేష్‌రాజు ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్య

సామర్లకోట: జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి రైలు కిందపడి శనివారం ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్సై బి.లోవరాజు తెలిపారు. సామర్లకోటలో అన్నపూర్ణా సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద ఎదురుగా పట్టాలపై తలపెట్టి ఆత్మహత్య చేసుకొన్న వ్యక్తిని రైల్వే కీమెన్ గుర్తించాడు. దీనిపై రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ సమాచారం మేరకు రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుని వద్ద లభించిన ఆధారాల మేరకు రంగంపేట మండలం కె.కోటపాడుకు చెందిన మిరియాల లోవయ్య (42)గా గుర్తించారు. వీరనాట్యం వృత్తితో జీవించే లోవయ్య మూడేళ్ల నుంచి అనారోగ్యానికి గురికావడం, టీబీ వ్యాధి పిల్లలకు వ్యాపిస్తుందని ఇంటి నుంచి వచ్చి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించి, ఎస్సై లోవరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు ఆభరణాల చోరీ

అమలాపురం టౌన్: స్థానిక ఎర్ర వంతెన సమీపంలో 216 జాతీయ రహదారి చెంతన ఉన్న షిర్డీసాయి మందిరం వెనుక వీధిలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. గురువారం అర్ధరాత్రి దాటిన జరిగిన ఈ ఘటనలో రూ.రెండు లక్షల విలువైన ఏడు కాసుల బంగారు ఆభరణాలను దొంగలు దోచుకున్నారు. పేరాబత్తుల రాధాకృష్ణ తన ఇంటికి తాళం వేసి కుటుంబ సమేతంగా హైదరాబాద్‌లోని తన కుమారుడి ఇంటికి వెళ్లారు. ఈ నేపథ్యంలో గుర్తు తెలియని వ్యక్తులు తలుపులు పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ డి.దుర్గాశేఖరరెడ్డి శనివారం తెలిపారు.